గ్రామాల్లో సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం

- ప్రజా చైతన్య యాత్రకు మంచి స్పందన
- దండకారణ్య జనతా పార్టీ వ్యవస్థాపకుడు ఏలియా



... వార్త 8వ పేజీలో



ఏయూలో గంజాయ్!

గంజాయి సేవించిన ఏడుగురు విద్యార్థులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది



- వారి జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభ్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులకు అప్పగింత
- వర్సిటీ విద్యార్థులు కాదంటున్న అధికారులు
- బయటి కళాశాలలకు చెందిన వారంటూ వాదన
- గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఏయూ సెక్యూరిటీ సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం గంజాయి వినియోగానికి అడ్డాగా మారుతోంది. గతంలో గంజాయి విక్రయిస్తూ సెక్యూరిటీ సిబ్బంది పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. సదరు సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవడంతో అప్పటికి సద్దుమణిగింది. కానీ ఇప్పటికీ వర్సిటీలో గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్టు సమాచారం.

తాజాగా గురువారం సాయంత్రం గంజాయి ప్యాకెట్లతో ఏడుగురు విద్యార్థులు వర్సిటీలోని ఓ హాస్టల్‌లో పట్టుబడడంతో కలకలం రేగింది. వర్సిటీ అధికారుల కథనం ప్రకారం...ఓ వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల వద్దకు బయట నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చారు. వారు తిరిగి వెళుతున్న సమయంలో వ్యవహారశైలి భిన్నంగా ఉండడంతో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేశారు. ఇద్దరు విద్యార్థుల జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిని పోలీసులకు అప్పగించి, ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు క్యాంపస్‌లోని తమ మిత్రుల వద్దకు వచ్చారన్నారు. వీరిలో ప్రిజంతోపాటు మరో కళాశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వీరు హాస్టల్ నుంచి వెళ్లే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. దీంతో వెంటనే ... మిగతా 7వ పేజీలో

ఇద్దరు ఏయూ విద్యార్థులే...

గంజాయితో దొరికిన విద్యార్థులంతా బయట కళాశాలలకు చెందినవారని ఏయూ అధికారులు చెబుతుండగా...పోలీసులు మాత్రం ఇద్దరు వర్సిటీ విద్యార్థులు ఉన్నట్టు తేల్చారు. ఆ ఇద్దరు ఏయూలోనే ఎమ్మెస్సీ చదువుతూ శ్రీకృష్ణదేవరాయలు వసతి గృహంలో ఉంటున్నారు. వారి వద్దకే బయట నుంచి మరో ఐదుగురు విద్యార్థులు వచ్చారు. బయట నుంచి వచ్చిన విద్యార్థులు గంజాయి తెచ్చారా? లేక ఏయూలో ఉన్న విద్యార్థుల వద్దే గంజాయి ఉందా?...అన్న విషయం తేలాల్సి ఉంది. వర్సిటీ అధికారులు మాత్రం ఏడుగురూ బయట నుంచి వచ్చిన విద్యార్థులు అని చెబుతుండడం గమనార్హం. ఏయూ విద్యార్థులు లేరని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రయోజనం లేదని, వర్సిటీలోకి గంజాయి ఎలా వస్తుందన్న దానిపై దృష్టి సారించాల్సిన అవసరముందని పలువురు పేర్కొంటున్నారు.

నారా భువనేశ్వరి 28న జి.మాడుగుల రాక

- 'నిజం గెలవాలి' పేరుతో పర్యటన
- చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు మనస్తాపంతో మృతిచెందిన కుటుంబాలకు ఓదార్పు



జి.మాడుగుల, ఫిబ్రవరి 23: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 28వ తేదీన జి.మాడుగుల మండలంలో పర్యటించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, ప్రధాన కార్యదర్శి కిముడు కల్యాణం తెలిపారు. వీరు శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి ఆయనను జైలుకు పంపినప్పుడు మనస్తాపంతో మృతిచెందిన వారి కుటుంబాలను 'నిజం గెలవాలి' పేరుతో ఆమె పరామర్శించి, ఆర్థిక సాయం



కోరాబు లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)



అనసూరి రాజారావు (ఫైల్ ఫొటో)

అందిస్తున్న విషయం తెలిసిందే. అప్పట్లో లువ్వాసింగి పంచాయతీ చిట్టంపుట్టు గ్రామానికి చెందిన కోరాబు లక్ష్మణరావు, మండల కేంద్రానికి చెందిన అనసూరి రాజారావు మృతిచెందారు. పురందేశ్వరి బుధవారం జి.మాడుగుల వచ్చి, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో గుండెలు ఆగి మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తారని, పార్టీ తరపున మంజూరు చేసిన సాయం చెక్కులను వారికి అందజేస్తారని టీడీపీ నాయకులు చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

స్పందన అర్జీలకు సత్వర మోక్షం

- ప్రజల సమస్యలను త్వరగా పరిష్కారించాలి
- అధికారులకు కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- 'ఐటీడీఏ' స్పందనలో 110 వినతులు స్వీకరణ



స్పందనలో అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

పాడేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లతో కలసి శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. స్పందనలో అందిన వినతులు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అలసత్వం వహిస్తే తగు చర్యలు చేపడతామన్నారు. స్పందన కార్యక్రమానికి హాజరు విషయంలో సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. స్పందనలో రహదారులు, తాగునీటి సమస్యలపై అధికంగా వినతులు వస్తున్నాయని, రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుగానే తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

స్పందనలో 110 వినతులు స్వీకరణ

స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు 110 వినతులను అధికారులకు అందజేశారు. అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ శరభగుడ గ్రామ శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని పెదలబుడు ఎంపీటీసీ సభ్యుడు డి.ఆనంద్‌కుమార్ కోరారు. పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీ శ్రీపురం గ్రామం నుంచి జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ చెరువువీధి వరకు రోడ్డు నిర్మించాలని కె.రాంబాబు, బి.కృష్ణ పడాల్, తదితరులు వినతిపత్రం సమర్పించారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి గ్రామ సచివాలయం భవనం త్వరితగతిన పూర్తి చేయాలని, పాడేరు మండలం చింతలవీధి కూడలి నుంచి పెదబయలు మండలం గలగండ వరకు రోడ్డు విస్తరించాలని పాంగి ప్రసాద్ వినతిపత్రం అందించారు.

ఇదే మండలం కుర్తాడి గ్రామం నుంచి బూరుగువీధి వరకు రోడ్డు నిర్మించాలని బొండపల్లి సర్పంచ్ జి.మత్స్యరాజు కోరారు. పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ నడిమివీధి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు వి.మంగమ్మ, కె.కొండమ్మ అర్జీ అందించారు. హుకుంపేట మండలం తడిగిరి, తాడిపుట్టు, తీగలవలస, జర్రకొండ; పెదబయలు మండలం ఇంజరి గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సీసీ రోడ్లకు బిల్లులు విడుదల చేయాలని కాంట్రాక్టర్ ఎ.నాగభూషణం వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని భాషా వలంటీర్లు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వీవీఎస్.శర్మ, భవానీ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఎల్‌డీఎం ఎన్.రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- ఏప్రిల్ పదో తేదీ వరకు గడువు
- అదే నెల 21న ప్రవేశ పరీక్ష
- ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వెల్లడి

పాడేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాలతోపాటు 6, 8, 9 తరగతుల్లో ఖాళీగా సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఐదో తరగతిలో ఒక్కో గురుకుల పాఠశాలలో 80 సీట్లు చొప్పున పాడేరు, అరకులోయ, తుమ్మానువలస, పెదబయలు, జి.మాడుగుల, కొయ్యూరు, సీలేరు, మారికవలసల్లోని గురుకులాల్లో మొత్తం 640 సీట్లు వున్నాయన్నారు. అలాగే ఆరో తరగతిలో 61, ఎనిమిదో తరగతిలో 10, తొమ్మిదో తరగతిలో 25 సీట్లు ఖాళీగా వున్నట్టు పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశానికి ఏప్రిల్ పదో తేదీలోగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు గురుకులం విభాగం సెల్ నంబర్: 9491030243కు ఫోన్ చేసి సంప్రదించాలని ఐటీడీఏ పీవో సూచించారు.

మన్యంలో పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- జి.మాడుగులలో 12.2 డిగ్రీలు

పాడేరు/ చింతపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. అయినప్పటికీ చలి ప్రభావం కొనసాగుతున్నది. ఏజెన్సీలో జి.మాడుగులలో 12.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా అరకులోయలో 12.3, చింతపల్లిలో 12.5, పాడేరులో 12.9, పెదబయలులో 13.6, హుకుంపేటలో 13.9, ముంచంగిపుట్టులో 14.1, డుంబ్రిగుడలో 15, అనంతగిరిలో 15.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పొగ మంచు కురుస్తున్నది. గత వారంతో పోలిస్తే పగలు వాతావరణం ఒకింత వేడిగానే వున్నప్పటికీ రాత్రిపూట చలిగానే వుంటున్నది.

మూడు రోజులపాటు చిరుజల్లులు

చింతపల్లి, ఫిబ్రవరి 23: జిల్లాలో శనివారం నుంచి మూడు రోజులపాటు ... మిగతా 8వ పేజీలో



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లు

ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లు ఆందోళన

ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లను వెంటనే రెన్యువల్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. విద్యా వలంటీర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మాతృ భాష విద్యా వలంటీర్లు శుక్రవారం గిరిజన సంఘం కార్యాలయం నుంచి సినిమాహాలు జంక్షన్ మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ప్రధాన గేటు వద పోలీసులు అడ్డగించడంతో నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే ధర్నాకు దిగారు. ప్రభుత్వ తీరును నిరసనగా నినాదాలు చేశారు. కొద్దిసేపటి తరువాత స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు వినతిపత్రం అందించారు. - 8లో

సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుదుత్పత్తి బంద్



గోదావరి డెల్టా అవసరాలకు నీటిని నిల్వ చేస్తున్న డొంకరాయి జలాశయం (ఫైల్ ఫొటో)

- గోదావరి డెల్టాకు నీటి అవసరాల దృష్ట్యా జెన్‌కో అధికారులు నిర్ణయం
- సీలేరు, డొంకరాయి, పొల్లూరుల్లో అన్ని యూనిట్లు షట్‌డౌన్
- మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లకు రెండు మాత్రమే రన్నింగ్

సీలేరు, ఫిబ్రవరి 23: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రబీ వరి సాగుకు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని ఏపీ జెన్‌కో అధికారులు దాదాపు నిలిపివేశారు. ఏటా ఫిబ్రవరి నుంచి గోదావరి డెల్టా అవసరాల కోసం సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుదుత్పత్తిని క్రమబద్ధీకరిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జోలాపుట్టు, బలిమెల జలాశయాలు పూర్తిస్థాయిలో నిండలేదు. మరోవైపు రబీ సీజన్ ప్రారంభమైన తరువాత వర్షాలు లేకపోవడంతో గోదావరి డెల్టాలో వరి సాగుకు నీటి వినియోగం పెరిగింది. రబీ వరి సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా వుండడానికి ఇరిగేషన్ అధికారుల వినతి మేరకు ఏపీ జెన్‌కో అధికారులు సీలేరు కాంప్లెక్సులోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో 725 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. డొంకరాయి జలాశయం నుంచి దిగువకు ఒక్క చుక్క నీటిని కూడా విడుదల చేయడంలేదు. అదే విధగా ఎగువన ఉన్న మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లు ఉండగా ఇందులో రెండు యూనిట్లు (2, 5) ఆర్ఎల్ఏ స్టడీ పేరిట కొన్ని నెలలుగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. అలాగే 4వ నంబర్ యూనిట్‌లో సాంకేతిక సమస్యతో తలెత్తడంతో ఇటీవల ఉత్పత్తి నిలిచిపోయింది. తాజాగా గురువారం 6వ నంబర్ యూనిట్‌కు సంబంధించిన కూలర్స్‌లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో విద్యుత్ ఉత్పత్తిని ఆపేశారు. ప్రస్తుతం మాచ్‌ఖండ్‌లో రెండు యూనిట్లు (1, 3) మాత్రమే పని చేస్తున్నాయి. రోజూ ఒక మిలియన్ యూనిట్ల విద్యుత్తును మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడ విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు బలిమెల జలాశయంలోకి చేరుతుంది. రానున్న రెండు నెలలపాటు గోదావరి డెల్టాలో రబీ వరికి నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బలిమెల నుంచి ఏపీ వాటాగా తీసుకొనే నీటిని కూడా జెన్‌కో అధికారులు నిలుపుదల చేశారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సులో బలిమెల జలాశయంలో ఏపీ వాటా, డొంకరాయి జలాశయంలో ఉన్న నీటి నిల్వలతో కలసి మొత్తం 32.52 టీఎంసీల నీరు అందుబాటులో వుంది. రబీ వరి పంట కోతకు వచ్చే వరకు గోదావరి డెల్టా నీటి అవసరాలనుబట్టి సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.



సీలేరు జలవిద్యుత్ కేంద్రం



అద్దరవీధిలో రైతులు విక్రయానికి సిద్ధం చేసిన జాఫ్రా గింజలు

జాఫ్రాకు గిరాకీ

- రికార్డు స్థాయిలో ధర
- కిలో రూ.140కు వర్తకులు కొనుగోలు



ఎండబెట్టిన జాఫ్రా కాయలు

చింతపల్లి, ఫిబ్రవరి 23: మన్యంలో జాఫ్రా(అన్నటో) ధర రికార్డు స్థాయిలో పెరిగింది. వర్తకులు కిలో రూ.140కు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఆదివాసీ రైతులు పంట పొలాల గట్లలో జాఫ్రాను సాగు చేస్తున్నారు. జాఫ్రా మొక్కల ఆకులను పశువులు ఆహారంగా తీసుకోవు. దీంతో రైతులు ప్రధానంగా పంట పొలాల గట్లలో కంచెగాను, మరోవైపు అదనపు ఆదాయం కోసం జాఫ్రా మొక్కలను సాగు చేసుకుంటున్నారు. జాఫ్రా గింజలను సహజసిద్ధ రంగుగా ఉపయోగిస్తారు. ఆర్గానిక్ కావడంతో పలు రకాల వంటకాల్లో జాఫ్రాను విరివిగా ఉపయోగిస్తుంటారు. దీంతో జాఫ్రా గింజలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది కిలో జాఫ్రా గింజలను వర్తకులు రూ.80 ధరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలోనే వర్తకులు కిలో రూ.100 ధరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో జాఫ్రా గింజలను వర్తకులు రూ.140కు కొనుగోలు చేస్తున్నారు. జాఫ్రా గింజలకు ఐటీడీఏ, గిరిజన సహకార సంస్థ మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోయినప్పటికి వర్తకులు మంచి ధరకు జాఫ్రా గింజలను కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

జంబ్లింగ్ పేరుతో నిబంధనలకు తూట్లు

- అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు...
- మూడు కళాశాలల విద్యార్థులకు స్థానికంగానే పరీక్షలు
- అచ్యుత కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కి.మీ. దూరంలోని కేంద్రాలు కేటాయింపు
- దివ్యాంగ విద్యార్థులపై జాలి చూపని అధికారులు



ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న దివ్యాంగ విద్యార్థులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23:

ఇంటర్ పరీక్షలకు కేంద్రాల కేటాయింపులో బోర్డు అధికారులు వివక్ష చూపిస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా... మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో కాలేజీని పరీక్షా కేంద్రంగా కేటాయించారు. కానీ మరో కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కిలోమీటర్ల దూరంలో కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. వీరిలో దివ్యాంగ విద్యార్థులపై కూడా ఉన్నారు. వివరాల్లోకి వెళితే...

అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో బోర్డు అధికారులు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కాకుండా చుట్టుపక్కల వున్న వేరే కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయిస్తున్నారు. ఈ మేరకు 15 కిలోమీటర్ల పరిధిలో వున్న కాలేజీలను మాత్రమే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేయాలి. కాగా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా, మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో ఒక కాలేజీని పరీక్షా కేంద్రంగా ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

పేకాట శిబిరంలో కత్తితో దాడిపై పోలీసుల ముమ్మర దర్యాప్తు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాలపురం శివారు తోటల్లో పేకాట శిబిరం వద్ద బుధవారం చోటు చేసుకున్న కత్తిపోటు దాడి ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనలో ఎంతమంది పాల్పడ్డారు? ఏమి జరిగింది.? వివాదం ఎలా ప్రారంభమైందనే అంశాల పై లోతుగా ఆరా తీస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ తొట్టె దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్ తొట్టి

లంకెలపాలెం, ఫిబ్రవరి 23: విద్యుత్ తీగలు తగలడంలో ఎండు గడ్డి ట్రాక్టర్ తొట్టె దగ్ధమైంది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ ఇంజన్ నుంచి తొట్టెని వేరు చేయడంతో గడ్డితోపాటు తొట్టి కాలి బుడిదైంది. ఈ ఘటన మండలంలోని గండివానిపాలెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివున్నాయి. శ్రీకాకుళం జిల్లా రాజాం నుంచి గడ్డి లోడుతో ట్రాక్టర్ పెదముషిడివాడకు బయలుదేరింది. గండివానిపాలెం వద్దకు వచ్చేసరికి పూర్తిగా చీకటి పడింది. దీంతో ప్రధాన రహదారిపై గల విద్యుత్ తీగలు గడ్డికి తగడంతో మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు ట్రాక్టర్ చుట్టూ వ్యాపించాయి. దీంతో డ్రైవర్ దశరథరావు వెంటనే నిలుపుదల వేసి ట్రాక్టర్ ఇంజన్‌ను తొట్టి నుంచి వేరు చేశాడు. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు పడలేదు. తొట్టి పూర్తిగా మంటల్లో చిక్కుకొని కాలి బుడిదైంది. మంటలు టైరుకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున శబ్దంతో పేలిపోయాయి. ఈ క్రమంలో స్థానికులు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గ్రావెల్ ట్రాక్టర్ల సీజ్

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23: మండలంలోని దార్లపూడి వద్ద అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ జయలక్ష్మి శుక్రవారం తెలిపారు. దార్లపూడి సమీపంలో ఉన్న పోలవరం కాలువకు చెందిన గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తునట్టు అందిన సమాచారం మేరకు ఆర్ఐ వినయ్ దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు చెప్పారు.

50 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

నాతవరం, ఫిబ్రవరి 23: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నాతవరం మండలం నుంచి గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి లింగంపేటకు చెందిన ఎ.శంకరయ్య యాభై మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి జరిపి మాధవనగరం జంక్షన్‌లో పట్టుకుని, అరెస్టు చేసినట్టు చెప్పారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

» రూ. 13 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

మహారాణిపేట, ఫిబ్రవరి 23: పగటి పూట తాళాలు వేసిన ఇళ్లలోకి ప్రవే శించి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ కామేపల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్టు డీసీపీ (క్రైమ్) పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 10న మధురానగర్‌లో నివాసముంటున్న నూలు వరలక్ష్మి, సూర్యప్రసాద్ ఇంట్లో వారు లేని సమయంలో చోరీ జరిగి రెండు తులాల బంగా రు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు ప్రాంతానికి చెందిన కామేపల్లి శ్రీనివాస్ అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. దీనితో పాటు గతంలో పలు నేరాలకు పాల్పడినట్టు తేలింది. మైసూర్, గోవా, చెన్నై తదితర ప్రాంతాలలో దొంగతనాలు చేస్తూ జల్సాగా తిరిగేవాడు. ఈ నేపథ్యంలో సుమా రు రూ. 13 లక్షల విలువైన 249 గ్రాముల బంగారాన్ని, 660 గ్రాముల వెండితో పాలు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు డీసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఏయూలో గంజాయ్!

... 5వ పేజీ తరువాయి

పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా వారిలో ఏయూ విద్యార్థులు ఎవరూ లేరని ఆయన వెల్లడించారు.

గుట్టుగా విక్రయాలు

వర్సిటీలో పలువురు విద్యార్థులు గంజాయి విని యోగానికి అలవాటు పడ్డారని సమాచారం. క్యాంపస్‌లోని హాస్టల్‌కు బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చి గంజాయి సేవించి వెళుతున్నారంటే..ఇక్కడి విద్యార్థులకు అలవాటు లేకుండానే ఇదంతా జరిగిందని నమ్మలేని పరిస్థితి. క్యాంపస్‌లోని విద్యార్థుల వ్యవహారాన్ని వర్సిటీ అధికారులు బయటపెట్టడం లేదు... కానీ అంతర్గతంగా వారిపైనా విచారణ సాగుతోందని చెబుతున్నారు. ఏయూ చుట్టుపక్కల అనేక దుకాణాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. విద్యార్థులకు గంజాయిని సరఫరా చేయడానికి కొన్ని బ్యాచ్‌లు ఉన్నాయని, ఈ విషయంలో సెక్యూరిటీ సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుంటారని చెబుతున్నారు. అందుకు వారికి కొంత మొత్తం అందుతుందంటున్నారు. గంజాయి విక్రయాలపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని క్యాంపస్‌లోని విద్యార్థులే పేర్కొంటున్నారు.

కఠినంగా వ్యవహరిస్తేనే...

బయటి విద్యార్థులు క్యాంపస్‌లోకి గంజాయి తీసుకుని వచ్చారంటే సెక్యూరిటీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం వేళ క్యాంపస్‌తో సంబంధం లేని వారు బ్యాగులతో సహా వర్సిటీలోకి వెళుతున్నా సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లోకి అడుగుపెట్టాలంటే ఐడీ కార్డులు తప్పనిసరి చేస్తూ గతంలో అధికారులు ఆదేశాలు జారీచేశారు. వాటిని సక్రమంగా పాటించకపోవడం వల్లే తాజా ఘటన చోటుచేసుకుందంటున్నారు. ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్న విద్యార్థులు ఇంకెంతమంది క్యాంపస్‌కు వచ్చి, వెళుతున్నారోననే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో మరింత కఠినంగా ఉంటామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇకపై వర్సిటీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా ఆదేశాలు జారీచేశామని, వసతి గృహాలకు బయటివారు రాకుండా చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ స్టీఫెన్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గుట్టుగా గంజాయి వినియోగం సాగుతోంది. గతంలో సెక్యూరిటీ సిబ్బందే గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. సదరు సెక్యూరిటీ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ, ఇప్పటికీ యూనివర్సిటీలో గుట్టుగా గంజాయి విక్రయాలు, వినియోగం సాగు తున్నాయని చెబుతుంటారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు పూర్తి


రేవుపోలవరంలో సముద్రతీరం పక్కనే కొండపై ఉన్న లక్ష్మీ మాధవ స్వామి వారి ఆలయం


అడ్డరోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ అప్పన్న

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23:
మాఘ పౌర్ణమి జాతరకు మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సముద్ర స్నానం ఆచరించిన భక్తులు పక్కనే కొండపై ఉన్న లక్ష్మీ మాధవస్వామిని దర్శించుకొని, పూజలు చేస్తారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్న ఈ జాతరకు శనివారం సాయంత్రం వరకు లక్ష మందికి వరకు భక్తులు తరలి వస్తారని నిర్వాహకులు అంచనా వేశారు. శుక్రవారం తహసీల్దార్ జయలక్ష్మి, డీటీ శ్యామ్ సముద్రతీరం వద్ద చేపట్టిన పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పుణ్యస్నానం ఆచరించడానికి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయంతో పాటు మెడికల్ క్యాంపు, స్త్రీలు బట్టలు మార్చుకోవడం కోసం నాలుగు గుడారాలు ఏర్పాటు చేసినట్టు డీటీ శ్యామ్ తెలిపారు. ముగ్గురు సీఐలు, పది మంది ఎస్ఐలు, వంద మంది సిబ్బందితో పాటు 25 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేసినట్టు సీఐ అప్పన్న చెప్పారు. బందోస్తుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి సీఐ అప్పన్న పలు సూచనలు చేశారు. సముద్రతీరంలో ప్రమాదకరమైన ప్రదేశాల్లో పోలీసులు ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రికి సముద్రతీరం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

జాతరకు 70 మంది పోలీస్ సిబ్బంది

పరవాడ, ఫిబ్రవరి 23:
మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం భక్తులు చేయనున్న సముద్ర స్నానాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు బందోబస్తు కొనసాగుతుందన్నారు. స్నానాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలన్నారు. భక్తులు అధిక మొత్తంలో నగదు, బంగారం ఆభరణాలు ధరించవద్దని సూచించారు. గజ ఈతగాళ్లను నియమించామన్నారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం మాఘ స్నానాల కోసం వచ్చే భక్తులకు ఉదయం ఏడు గంటల నుంచి అల్పాహారం పంపిణీ చేయనున్నట్టు తెలుగు యువత మండల అధ్యక్షుడు పైలా చినఅక్కునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో ఐదువేల మంది భక్తులకు అల్పాహారం అందజేస్తామన్నారు.

పూడిమడక జాతర ప్రారంభం

» తీరంలో ఉత్తరాంధ్ర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహణ

» అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు


పూడిమడక బీచ్‌లో కబడ్డీ ఆడుతున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: మాఘపౌర్ణమి సందర్భంగా పూడిమడకలో శుక్రవారం సాయంత్రం నుంచి జాతర ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి జగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు చేసిన అనంతరం తీరంలో గల రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామిని దర్శించుకుంటారు. అయితే శుక్రవారం రాత్రంతా భక్తులు పూడిమడక సముద్ర తీరంలో గడుపుతారు. ఈ సందర్భంగా తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా తీరంలో రంగుల రాట్నాలు, జైంట్ వీల్ వంటివి ఏర్పాటు చేశారు. తప్పెట గుళ్లు, తోడపెద్దులు, చిటికెల భజన, జంగమ దేవర్లు శుక్రవారం రాత్రికి పూడిమడక చేరుకున్నారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన పూడిమడక తీరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పూడిమడక సచివాలయ ప్రాంగణంలో పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీసులను నాలుగు విభాగాలుగా విభజించి ట్రాఫిక్ కంట్రోల్, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద, సముద్ర తీరం వద్ద ఉండేలా పోలీసులను విభజించారు. అలాగే గజ ఈతగాళ్లకు ప్రత్యేక బనియన్లు ఇచ్చి తీరం వద్ద ఉంచారు. ఎనిమిది మర పడవలని కూడా తీరం వద్ద అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. పూడిమడక బీచ్ బాయిస్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నారు. విజేతలకు వరుసగా రూ.30, రూ.20, రూ.10 వేలు చొప్పున బహుమతులు ప్రకటించారు. పూడిమడక ఉన్నత పాఠశాల నుంచి సముద్ర తీరం వరకు భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు.

పాఠశాలలో పెళ్లి వేడుక

» ఉపాధ్యాయులను ఒక నేత బెదిరించి వేదిక ఏర్పాటు


కొండకర్ల ఉన్నత పాఠశాలలో వివాహానికి వేసిన సెట్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: పాఠశాల వివాహ వేదికయ్యింది. ఉపాధ్యాయులను బెదిరించి ఒక నాయకుడు తమ బంధువుల వివాహానికి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని కొండకర్ల ఒక నాయకుని బంధువుల వివాహం జరుగుతుంది. ఈ పెళ్లిని పాఠశాల ఆవరణలో వేదిక ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రికి వివాహం.. కాని గురువారం నుంచి పాఠశాల ఆవరణలో పెళ్లి మండపం సెట్, భారీ స్థాయిలో స్వాగత ద్వారాలు, విందు భోజనాలకు టెంట్‌లు, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. దీంతో గురు, శుక్రవారాల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాల ఆవరణలో ఇటువంటివి జరపకూడదని ఉపాధ్యాయలు ఎంత చెప్పినా ఆ నాయకుడు వారిని బెదిరించి మరీ భారీ సెట్‌లు వేశారు. దీంతో రెండు రోజుల పాటు విద్యార్థులకు ఉదయం పూట ప్రార్థనలు జరగలేదు. అంతేకాక రెండు రోజుల పాటు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నత్తనడకన 'జల్ జీవన్' పనులు!

» ఏడాది క్రితం నాతవరం మండలంలో ప్రారంభం

» రెండు పంచాయతీలలో మాత్రమే పూర్తి

» కొన్నిచోట్ల తవ్వకాలు చేపట్టి నిలిపివేసిన కాంట్రాక్టర్లు

» సిమెంటు రోడ్లు పాడవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు


మర్రిపాలెంలో నత్తనడకన సాగుతున్న పనులు


తవ్వకాలు చేపట్టడంతో శృంగవరంలో పాడైన సిమెంట్ రోడ్డు

నాతవరం, ఫిబ్రవరి 23:
జల్‌జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరయ్యాయి. గత ఏడాది జనవరిలో మండలంలోని ప్రతి పంచాయతీలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. సందరకోట, మాసయ్యపేట పంచాయతీలలో మాత్రమే ఈ కుళాయిలు పనులు పూర్తికాగా, మిగిలిన పంచాయతీలో నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు నిమిత్తం సిమెంట్ రోడ్డు పక్కనే మిషన్‌తో గోతులు తవ్వారు. అయితే వెంటనే పనులు పూర్తిచేయకుండా వదిలేస్తున్నారు. దీంతో రాత్రి వేళలలో విద్యుత్ సరఫరా లేని సమయాల్లో ఆయా గోతులలో పడి పలువురు గాయాలకు గురవుతున్నారు. అలాగే శృంగవరం వంటి కొన్ని పంచాయతీలలో కుళాయిల ఏర్పాటు కోసం బాగా ఉన్న సిమెంట్ రోడ్లను మిషన్ సహాయంతో తవ్వేసి ఆ తర్వాత సరిగా కప్పకుండా వదలి వెళ్లిపోతున్నారు. ఫలితంగా సిమెంట్ రోడ్లు పాడవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే మన్యపురట్ల, పీఎస్‌డీ పాలెం, ఎస్‌బీపట్నం, రామన్నపాలెం తదితర పంచాయతీలలో ఈ పనులు చేసే కాంట్రాక్టర్లు నిధులు మంజూరు కాలేదని పనులను మధ్యలో నిలిపివేసి వెళ్లిపోయినట్టు పలువురు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల వారికి సమస్యలు తప్పడం లేదు. ఇలా కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదలి వెళ్లిన పంచాయతీలలో కొత్తగా కాంట్రాక్టర్లను ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెపుతున్నారు. సుమారు ఏడాది నుంచి మండలంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు నెమ్మదిగా జరుగుతుండడం వల్ల సిమెంట్ రోడ్ల పక్కన తవ్విన గోతులతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు తవ్వి వదిలేసిన సిమెంటు రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గంజాయి సేవించిన ఏయూ విద్యార్థుల అరెస్టు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23: ఏయూలో గంజాయి సేవిస్తున్న ఏడుగుర్ని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు ఎమ్మెస్సీ చదువుతుండగా ఐదుగురు వారి స్నేహితులు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏయూలో ఎమ్మెస్సీ చదువుతున్న విద్యార్థులు సైన్స్ కళాశాలకు చెందిన శ్రీకృష్ణదేవరాయ వసతిగృహంలో ఉంటున్నారు. వారికి బయట ఉన్న ఐదుగురితో స్నేహం ఏర్పడింది. వారంతా మాదకద్రవ్యాలకు బానిసై వసతి గృహంలో గంజాయి, సిగిరెట్లు సేవిస్తుంటారు. ఈక్రమంలో గురువారం రాత్రి వసతి గృహంలోని వారి రూమ్‌లో ఏడుగురూ సిగిరెట్లు తాగుతుండగా హాస్టల్ సెక్యూరిటీ గార్డు గమనించి, చీఫ్ సెక్యూరిటీ అధికారికి సమాచారమిచ్చాడు. వెంటనే ఆయన తనిఖీ చేయగా గంజాయి కలిపిన సిగిరెట్లు, 5 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభ్యమయ్యాయి. ఈమేరకు ఆయన మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

వాడపాలెం తీరంలో ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

రాంబిల్లి, ఫిబ్రవరి 23: రాంబిల్లి శివారు వాడపాలెం సముద్రతీరంలో ఈ నెల 24న జరగనున్న మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా సీఐ లక్ష్మణరావు ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపాలెం తీరంలో మాఘస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తీరం వెంబడి పోలీస్ గస్తీతో పాటు గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్నానాలు ఆచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు స్నానాలు చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు.

జిల్లాలో 90 వేల మొక్కలు ప్లాంటేషన్


రోడ్డు పక్క మొక్కలు పరిశీలించేందుకు వచ్చిన డీఎఫ్‌వో లక్ష్మణ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 23 : జిల్లాలో ఈ ఏడాది 90 వేల మొక్కలను నాటుతున్నట్టు డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని కేబీ రోడ్డుకు ఇరుపక్కలా నాటిన మొక్కలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 50 కిలోమీటర్ల మేర 50 వేల మొక్కలను, బ్లాక్ ప్లాంటేషన్ కింద 40 వేల మొక్కలను నాటుతున్నామన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ కింద ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ యార్డుల్లో తెల్లమద్ది, వేగిసా తదితర రకాల మొక్కలను నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం రేంజ్ ఆఫీసర్ బి.గౌరీసు, రావికమతం, చోడవరం సెక్షన్ ఆఫీసర్లు ఓఎస్ఎన్ మూర్తి, జి.రమణారావు, వన సేవకుడు జి.ముత్యాలు పాల్గొన్నారు.

నేడు వైశ్యరాజు జ్యూయలర్స్ ప్రారంభం

అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యనారాయణ థియేటర్‌కు సమీపంలో శనివారం ఉదయం 11 గంటల 46 నిమిషాలకు వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ప్రజలకు వైశ్యరాజు జ్యూయలర్స్ చేరువ చేసేందుకు నూతన బ్రాంచి ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నూతన బ్రాంచి ప్రారంభోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరై వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు.

గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్‌కు పటిష్ఠ బందోబస్తు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: జిల్లాలో వచ్చే ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ రాత పరీక్షకు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆయా కేంద్రాల్లో 10,627 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను కేంద్రాల లోపలకు అనుమతిస్తామన్నారు. 10.15 గంటలకు ఒక నిముషం దాటినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించమన్నారు. రాత పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌లో పేర్కొన్న నియమ నిబంధనలను పాటించాలన్నారు. సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు అనుమతించమన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

నర్సీపట్నానికి చెందిన డాక్టర్‌కు బంగారు పతకం

» రేడియాలజీ విభాగంలో టాపర్‌గా నిలిచిన రమ్యాదేవి

» మహారాష్ట్ర హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవంలో పురస్కారం ప్రదానం


పతకం అందుకున్న డాక్టర్ రమ్యాదేవి

నర్సీపట్నం, ఫిబ్రవరి 23: రేడియాలజీ విభాగంలో నర్సీపట్నానికి చెందిన డాక్టర్ అల్లు రమ్యాదేవి మహారాష్ట్ర హెల్త్ యూనివర్సిటీ స్టేట్ టాపర్‌గా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ మేరకు శుక్రవారం నాసిక్‌లో జరిగిన వర్సిటీ 23వ స్నాతకోత్సవంలో ఆ రాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్, ఆరోగ్య శాఖా మంత్రి హసన్ ముష్రిఫ్, వైస్ చాన్సలర్ డాక్టర్ నితిన్ గంగనే, లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ మాధురీ కనిట్కర్‌ల చేతుల మీదుగా ఆమె బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. డాక్టర్ రమ్యాదేవి తండ్రి పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, తల్లి రత్నకుమారి నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. భర్త డాక్టర్ స్నేహిత్‌రెడ్డి ఎండీ పెడియాట్రిక్స్ పూర్తి చేసి స్పెషలైజేషన్ కోర్సు చేస్తున్నారు.

1న ప్రధాని రాక?

ఏయూలో బహిరంగ సభ.. ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, ఫిబ్రవరి 23: వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోదీ మార్చి ఒకటో తేదీన నగరానికి రానున్నట్టు సమాచారం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బహిరంగ సభలో పాల్గొంటారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులతో కలిసి ఏయూ మైదానాన్ని పరిశీలించారు. ప్రధాని పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బలమైన బారికేడ్లు నిర్మించాలని, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఈడీలు రాజీవ్ గోయల్, అభిషేక్ త్రివేది, సురేంద్రగుప్త, సీజీఎం (హెచ్‌ఆర్) కిరణ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలతో కలిసి మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్, దొన్నుదొర

భావితరాల కోసం బాబు సీఎం కావాలి

» టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

అరకులోయ, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో భావితరాల ఉజ్వల భవిత కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకుందామని పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. అనంతగిరి మండలంలోని కంటిపురం గ్రామంలో శుక్రవారం పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. బావితరాలకు చక్కటి భవిష్యత్ ఉండాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా-జనసేన కూటమి బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు గొప్ప విజయాన్ని అందిస్తే, చేతకాని సైకో సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని ఆయన దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో సర్పంచులు ఏమీ చేయలేని దుస్థితి దాపురించందన్నారు. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. ఈ పథకాలతో కుటుంబ సమేతంగా లభించే లబ్ధిపై వారిని చైతన్యపరచాలని సూచించారు. ప్రధానంగా వైసీపీ అరాచక పాలనను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన బలపర్చే అభ్యర్థులకు ఓటు వేసేలా పాటుపడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ అనంతగిరి, అరకులోయ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యాసనా పురోగతి కార్యక్రమం పరిశీలన



పాడేరు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అభ్యాసనను పరిశీలిస్తున్న సభ్యులు

పాడేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాసన పురోగతి కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. అభ్యాసనా పురోగతి కార్యక్రమం రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు పి.ఈశ్వరరావు, సీహెచ్.ఎస్.దొర తొలుత స్థానిక ఇంగ్లీస్ మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. అక్కడ పలు తరగతుల విద్యార్థినులతో మాట్లాడి, వారి అభ్యాసనా పురోగతిని పరిశీలించారు. అలాగే పలు పాఠ్యాంశాలను టీచర్లతో బోధింపజేసి, వారి బోధనా పటిమను పరిశీలించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శించి, అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. గురుకుల పాఠశాల సిబ్బందితోనూ బృందం సభ్యులు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి-2 సిహెచ్.సరస్వతిదేవి, గురుకులం ప్రిన్సిపాల్ జి.గణేశ్, ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్‌ఎం ఎం.గంగాభవానీ, సీఆర్‌పీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం

» ప్రజా చైతన్య యాత్రకు మంచి స్పందన

» దండకారణ్య జనతా పార్టీ వ్యవస్థాపకుడు ఏలియా



చైతన్య యాత్రలో మాట్లాడుతున్న చెండా ఏలియా

అరకులోయ, ఫిబ్రవరి 23: గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని దండకారణ్య జనతా పార్టీ వ్యవస్థాపకుడు చెండా ఏలియా అన్నారు. ముంచంగిపుట్టులో ఈ నెల 19న ప్రారంభమైన దండకారణ్య ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం అరకులోయకు చేరుకుంది. ఈ సందర్భంగా మ్యూజియం సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మారుమూల గ్రామాల్లో పర్యటించగా మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతుండడం కనిపించిందన్నారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా లేకగెడ్డలు, పొలాల్లోని కలుషిత ఊట నీటిని గిరిజనులు తెచ్చుకుని తాగుతున్నారని, దీనివల్ల తరచూ రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలను ఏర్పాటుచేసి ఎంత పోరాడినా ప్రభుత్వాలు స్పందించడం లేదని, దీంతో రాజకీయంగా ఎదుర్కోవాలన్న లక్ష్యంతో దండకారణ్య జనతా పార్టీని స్థాపించి పోరాడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా చేపట్టి ప్రజా చైతన్య యాత్రకు మంచి స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రజలు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాఫీ తోటలకు పరిహారం చెల్లించరూ..



పరిహారం అందలేదని విచారం వ్యక్తం చేస్తున్న వంజరి గ్రామస్థులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 23: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సుమారు 50 కుటుంబాల కాఫీ తోటలు ధ్వంసమయ్యాయని, ఇందుకు పరిహారం చెల్లించాలని వంజరి గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు పాడేరు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు గ్రామానికి చెందిన వి.చిరంజీవినాయుడు, రామూర్తినాయుడు తెలిపారు. కాఫీ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఎటువంటి నష్టపరిహార చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులపై దాడులను ఆపండి



ప్ల కార్డులు చేతపట్టి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 23: రైతులపై దాడులను ఆపాలని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీపీఎం మండల నాయకులు కె.త్రినాథ్, ఎంఎం.శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్ల కార్డులు చేతపట్టి ఆందోళనకు దిగారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, ఎంఎస్‌పి అమలు చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ దాడిలో ఉద్యమకారుడు కరణ్ సింగ్ మృతి చెందగా, అనేక మంది రైతులు గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు గాసిరాం దొర, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పథకంతో యువత భవిష్యత్‌కు గ్యారంటీ

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 23: తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యువగళం పథకంతో యువత భవిష్యత్ గ్యారంటీ లభిస్తుందని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. యువత తలచుకుంటే సాధ్యం కానిదేదీ లేదన్నారు. అవినీతిని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజా స్వామ్యాన్ని రక్షించాలన్నా యువతే కీలకమన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అందుకు రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై యువత మొదటి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. యువగళం పాదయాత్రలో భాగంగా రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకున్న లోకేశ్, యువత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని యువగళం పథకాన్ని పెట్టారన్నారు. 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతిని అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువత, ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు ఎదుర్కొన్న ఇబ్బందులను అందరూ తెలుసుకున్నారన్నారు.

టీడీపీ పాలనతోనే అభివృద్ధి సాధ్యం

తెలుగుదేశం పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి



చీమలాపల్లిలో నినాదాలు చేస్తున్న గిడ్డి ఈశ్వరి, పార్టీ నాయకులు

గిడ్డి ఈశ్వరి అన్నారు. ఐనాడ పంచాయతీలోని చీమలాపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగించిన వైసీపీని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని 20 ఏళ్ల వెనక్కి నెట్టారన్నారు. ప్రజలు, నిరుద్యోగ యువత చైతన్యవంతులై వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అధికారాన్ని అందించి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, పార్టీ బుద్ద జ్యోతికిరణ్ పాల్గొన్నారు.

మాతృ భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

గిరిజన సంఘం జాతీయ నేత అప్పలనర్స

విద్యా వలంటీర్లతో ఐటీడీఏ ఎదుట ధర్నా

పాడేరు రూరల్, ఫిబ్రవరి 23: ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లను వెంటనే రెన్యువల్ చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ మేరకు మాతృ భాష విద్యా వలంటీర్లతో శుక్రవారం ఐటీడీఏ ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందు గిరిజన సంఘం కార్యాలయం నుంచి సినిమా హాలు జంక్షన్ మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ప్రధాన గేటు వద్ద వలంటీర్లను పోలీసులు అడ్డగించడంతో నినాదాలతో హోరెత్తించారు. దీంతో గేటు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత పెంచడం, నైపుణ్యత సాధించడంలో ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వీరికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే మాతృ భాష విద్యా బోధన సాధ్యమన్నారు. రాష్ట్రంలో 1400 పాఠశాలల్లో మాతృ భాష విద్యా బోధన ప్రారంభించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో గిరిజన ప్రాంతంలో చిన్నారులకు ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారిందని వాపోయారు. స్కూల్ కమిటీల ద్వారా మాతృ భాషలో బోధనకు నియమించిన వలంటీర్లకు ఫిబ్రవరి 29 వరకు మాత్రమే నిధులు కేటాయించడం విచారకమన్నారు. మార్చి, ఏప్రిల్ నెలలకు బడ్జెట్‌ను కేటాయించి వలంటీర్‌లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో కలెక్టర్, పీవోలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి పాంగి శ్రీను, రాష్ట్ర నాయకులు షర్భునాయుడు, చంద్రయ్య వీరయ్య, గణేష్, కుమారి, రమేష్, జగన్ పాల్గొన్నారు.

పసుపు పంటకు సేంద్రియ ధ్రువీకరణ

చింతపల్లి, ఫిబ్రవరి 23: గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపు పంటకు సేంద్రియ ధ్రువీకరణ పత్రం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ డాక్టర్ ఎస్.రవి చెప్పారు. మండలంలోని సిరిపురం గ్రామంలో శుక్రవారం ఆదివాసీ రైతులు పండించిన పసుపు పంటలోని నమూనాలను స్థానిక ఉద్యానశాఖ అధికారి బాలకర్ణతో కలిసి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు సాధారణంగా సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నప్పటికీ ఆర్గానిక్ ధ్రువీకరణ పత్రంలేక గరిష్ఠ ధర పొందలేకపోతున్నారన్నారు. ఈ మేరకు ఎంపిక చేసిన రైతులు పండించిన పసుపు పంటకు సేంద్రియ ధ్రువీకరణపత్రం అందించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. పంటను మూడేళ్ల పాటు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి, రసాయనిక అవశేషాలు లేనట్టు గుర్తించాక పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో, హార్టికల్చ్, అగ్రికల్చర్ సహాయకులు పాల్గొన్నారు.

టీబీపై విద్యార్థులకు అవగాహన అవసరం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 23: ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు టీబీ వ్యాధిపై అవగాహన అవసరమని వైద్యాధికారి సౌమ్య సూచించారు. ఈదులపాలెం పీహెచ్‌సీ పరిధిలోని మల్యపాలెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫం, నోటి నుంచి రక్తం పడడం, ఆకలి లేకపోవడం, రాత్రి సమయంలో జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల్లో వ్యాధికి గురైనట్టు నిర్ధారణ జరిగితే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు అందిస్తారన్నారు. వ్యాధి లక్షణాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సదానందం, ఫీల్డ్ కోఆర్డినేటర్ ధనరాజు, హెచ్‌వీ కొండమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎంలు గాయిత్రి, రాజేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

హుకుంపేట, ఫిబ్రవరి 23: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పథకంలో మహిళలను భాగస్వాములుగా చేస్తూ, వారి ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదును ప్రభుత్వం జమ చేస్తున్నదన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైసీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎస్.కృష్ణారావు, ఎంపీపీ రాజుబాబు, శ్రీనిధి ఏజీఎం కామరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లూరి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 23: అల్లూరి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా పాడేరుకు చెందిన కొట్టగుళ్లి సుబ్బారావును నియమించామని సంఘం వ్యవస్థాపకులు పడాల వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం పాడేరులో జరిగిన యువజన సంఘం సభ్యుల సమావేశంలో సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. సమస్యల పరిష్కార కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్న ప్రస్తుత సుబ్బారావును ఈ పదవిలో నియమించినట్టు వీరభద్రరావు చెప్పారు. అనంతరం ఐటీడీఏ నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్‌వీఎస్.రాజు, ప్రకాష్, శ్యామలా వరలక్ష్మి, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

పెదబయలు, ఫిబ్రవరి 23: మండలంలోని మారుమూల గోమంగి పంచాయితీలో పరిధిలో శుక్రవారం 108 అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. మారుమూల లింగేటి పంచాయితీ జరుకుల పెదబయలు గ్రామంలో నిండు గర్భిణి లువ్వాబు రామలక్ష్మికి గురువారం రాత్రి పురిటినొప్పులు మొదలవ్వడంతో భర్త కృష్ణారావు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకొని రామలక్ష్మిని ముచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోని గోమంగి మినీ గురుకుల పాఠశాల సమీపంలో తెల్లావారు జామున మూడున్నర గంటలకు ప్రసవమైంది. ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ రవి తెలిపారు.

ధారాలమ్మ ఆలయం పునర్నిర్మాణానికి 3న శంకుస్థాపన

సీలేరు, ఫిబ్రవరి 23: గిరిజనుల ఆరాధ్య దైవమైన ధారాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి వచ్చే నెల 3వ తేదీన ముహూర్తం ఖరారు చేసినట్టు దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షల సీజీఎస్ నిధులు మంజూరు కావడంతో ఇటీవల ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్టు చెప్పారు. ఈ మేరకు తునికి చెందిన సిద్ధాంతులు, వేద పండితులు ప్రసాద్ ఈ ముహూర్తాన్ని ఖరారు చేశారన్నారు. ఈ నెల 29 న అమ్మవారి మండపం తొలగించనున్నట్టు చెప్పారు. ఎండోన్‌మెంట్ అధికారులు కృష్ణంరాజు, గొర్లి గణేశ్వరరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వారపు సంతలో తూకాలను తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

సంతలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 23: మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం జరిగిన వారపు సంతలో లీగల్ మెట్రాలజీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ పర్యవేక్షణలో అసిస్టెంట్ కంట్రోలర్ రామచంద్రయ్య, ఇన్‌స్పెక్టర్ రామారావు సిబ్బందితో కలిసి కిరణా, కూరగాయల దుకాణాల్లో తనిఖీలు చేశారు. కాటాల్లో వ్యత్యాసాలు ఉన్నా, సీలు లేని కాటాలు వేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే సంతకు వచ్చిన వినియోగ దారులకు తూనికలు, కొలతల మోసాలపై అవగాహన కల్పించారు. కాటాలు వాడుతున్న వ్యాపారులు సీలు వేయించుకోవాలని సూచించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

సీలేరులో నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు



సీలేరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

సీలేరు, ఫిబ్రవరి 23: గూడెం కొత్తవీధి మండలంలోని సీలేరులో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదు. దీంతో ఈ ప్రాంత వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాత్రి నుంచి నిలిచిపోయిన బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ శుక్రవారం సాయంత్రానికి కూడా పునరుద్ధరించకపోవడంతో సెల్‌ఫోన్లు మూగపోయాయి. అలాగే నెట్‌వర్క్ కూడా లేకపోవడంతో శుక్రవారం పోస్టాఫీసు, బ్యాంకు, జెన్‌కో కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీలేరు ప్రాంతంలో రెండు, మూడు రోజులకోసారి బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. నెట్‌వర్క్ రోజుల తరబడి నిలిచిపోతున్నప్పటికీ బిల్లులు మాత్రం యథావిధిగా వస్తుండడంపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి నెట్‌వర్క్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దార్లగొంది గ్రామస్థులతో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీదేవి

సీలేరు, ఫిబ్రవరి 23: ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకుంటే గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీవో లక్ష్మీదేవి చెప్పారు. గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ సెక్టార్ పరిధిలో మారుమూల గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా దొరగొంది, దార్లగొంది గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి నెలా సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ధారకొండ సెక్టారులోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు.

పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

... 5వ పేజీ తరువాయి

తేలికపాటి జల్లులు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రకటించారు. అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం బ్లాక్‌ల పరిధిలో శని, ఆది, సోమవారాల్లో కనిష్ఠంగా 0.9 ఎం.ఎం., గరిష్ఠంగా 7.4 ఎం.ఎం. వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షసూచన ఉన్నందున కల్లాల్లో ఎండబెట్టుకున్న మిరియాలు, కాఫీ చెర్రీ గింజలు తడిసిపోకుండగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

... 5వ పేజీ తరువాయి

ఎంపిక చేశారు. అయితే అచ్యుత జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రం కేటాయించలేదు. జంబ్లింగ్ పేరుతో 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఎలమంచిలి దరి కొక్కిరాపల్లిలో, 28 కిలోమీటర్ల దూరంలో వున్న కశింకోట మండలం తాళ్లపాలెంలోని కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. అచ్యుత కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దివ్యాంగ (అంధ, బధిర, మూగ, శరీర వైకల్యం కలిగిన) విద్యార్థులు ఐదుగురు ఉన్నారు. వీరికి జంబ్లింగ్ వర్తించదన్న నిబంధనను అధికారులు బేఖాతరు చేశారు. కాగా 15 కిలోమీటర్లలోపు అనే నిబంధనను ఇంటర్ బోర్డు అధికారులు తుంగలో తొక్కడమే కాకుండా దివ్యాంగ విద్యార్థులన్న కనికరం కూడా లేకుండా సుదూరంలో వున్న కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. దీనిపై కళాశాల నిర్వాహకులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

26 నుంచి అక్షరాస్యతా వారోత్సవాలు

పాడేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు-2024 నిర్వహిస్తామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.రవితేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే విద్యార్థులకు బ్యాంకుల వల్ల కలిగే ఉపయోగాలు, వాటి అవసరాలు, డిజిటల్ బ్యాంకింగ్, డబ్బు పొదుపుపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ఆయా అంశాలపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని ఎల్‌డీఎం తెలిపారు.

ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

» ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు



శేషగిరిరావుకు నోటీసు అందిస్తున్న పోలీసు

పెదబయలు, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి నశించాలని ఎస్టీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు నీకరి శేషగిరిరావు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి భంగం కలిగించేందుకు ఆంక్షలు విధిస్తూ శుక్రవారం తమ విధులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో పోలీసుల ద్వారా నోటీసులు అందజేయడం ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేరుస్తామని ఓ వైపు చర్చలకు పిలుస్తూనే, మరో వైపు ఇలా నడి రోడ్డుపై ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను సంఘ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగుల సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉద్యోగులపై నిరంకుశత్వానికి పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం తప్పదని ఆయన స్పష్టం చేశారు.

టీడీపీ యువ నాయకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న టీడీపీ నేత రామకృష్ణ

జి.మాడుగుల, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలో టీడీపీ యువ నాయకులు శుక్రవారం రక్తదానం చేశారు. గెమ్మెలి గ్రామానికి చెందిన గెమ్మెలి సరస్వతికి పాడేరు ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరమన్న విషయం తెలుసుకుని వారు ముందుకు వచ్చారు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లకే రామకృష్ణ, కోరాబు శ్రీనివాస్ తదితరులు రక్తాన్ని దానం చేశారు. వారిని స్థానిక ప్రజలు అభినందించారు.

మీడియాపై దాడి అమానుషం

» టీడీపీ డివిజన్ నేత పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 23: మీడియాపై దాడులు అమానుషమని టీడీపీ పార్టీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి అన్నారు. మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం దాడులకు ప్రోత్సహించడం దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ, విలేకర్లపైన, కర్నూలు ఈనాడు కార్యాలయంపైన కొంత మంది వైసీపీ కార్యకర్తలు దాడులకు దిగడం అన్యాయమన్నారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా గొంతునొక్కేందుకు ప్రభుత్వం చూస్తుందని, అందులో భాగంగానే పార్టీ క్యాడర్‌ను దాడులకు ప్రోత్సహిస్తున్నదని ఆయన ఆరోపించారు. మీడియాపై దాడి అంటే ప్రజలపై దాడి చేసినట్టేనని, ఇటువంటి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పశు సంవర్ధ శాఖ జిల్లా డైరెక్టర్‌గా శ్రీరాములు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 23: పశు సంవర్ధక శాఖ అల్లూరి జిల్లా డైరెక్టర్‌గా జడ్పీటీసీ మాజీ సభ్యుడు మండ్యాగురు శ్రీరాములును ప్రభుత్వం నియమించింది. అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీరాములును కలిసి నియామక పత్రాన్ని అందించారు. అలాగే శాలువలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పదవి వరించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు విజయ, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నాయకులు కృష్ణారావు, సింహాచలం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అరకు సంతలో బీజేపీ ప్రజా పోరు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 23: మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం జరిగిన సంతలో బీజేపీ నాయకులు ప్రజా పోరు యాత్రను నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి మూర్తి ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం ఆదివాసీలకు చేస్తున్న మోసపూరితమైన పాలనను వ్యతిరేకిస్తూ ఈ యాత్ర సాగించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గిరిజనులకు అవగాహన కల్పించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, గిరిజన యువ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, అరకు అసెంబ్లీ కన్వీనర్ ధర్మరాజు, రాష్ట్ర కార్యదర్శి రామచందర్, నాయకులు దేవదాసు, తమ్మన్న, ఆనంద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి

జి.మాడుగుల, ఫిబ్రవరి 23: విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏటీడబ్ల్యూవో ఎ.తిరుపాల్ ఆదేశించారు. కొత్తూరు బాలురు-1 ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన తీరును అడిగి తెలుసుకున్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆర్.లోహిత్‌జయసాగర్ తెలిపారు. ఎంపీపీ కొర్రా పద్మ అధ్యక్షతనలో జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.